# ఆంతర్యం

ఆ గదిలో నిశ్శబ్దం –

రాంబాబు, పార్వతి, రామం డ్రాయింగ్‌రూమ్‌లో కూచున్నారేగాని ఎవ్వరూ మాట్లాడ్డంలేదు. అందుకే ఆ నిశ్శబ్దం! ఏదో సమస్య వాళ్ళ ముందర నగ్నంగా నిల్చున్నట్టుంది.

చివరికి రాంబాబే ప్రారంభించాడు. ఇది చాలా అన్యాయమని, అక్రమం అని, ఆ రోజు నుంచీ చెబుతూనే ఉన్నాను. మనందరం ఇష్టపడే సువర్ణని మనింటి కోడలుగా తెచ్చుకున్నాం. కట్న కానుకలు దండిగానే తీసుకున్నాం. ఇన్నాళ్ళ తర్వాత, ఆ అమ్మాయి నచ్చలేదని, ఆ అమ్మాయితో కాపురం చెయ్యనని, ఈ బడుద్దాయి అంటే నువ్వు కూడా 'వూ' కొట్టడం, కోడల్ని పంపించేయడం పెద్దమనిషి తరహాగా లేదు పార్వతీ!" అసహనంతో గదిలో పచార్లు చేస్తూ అన్నాడు రాంబాబు.

పార్వతి భర్తకేసి తీక్షణంగా చూసింది. "అబ్బ! మీరూరుకోండి. పెద్ద తెలివైనవారని మీకు మీరుగా అనుకుంటారేమోగాని మీకేమీ ప్రపంచ జ్ఞానం లేదండి. అబ్బాయి మొదట్లో ఒప్పుకున్నాడూ అంటే కేవలం మన ప్రోద్బలం వల్లనే! లేకపోతే వీడికి దీటైన పెళ్ళామా అది?" తన సహజ ధోరణిలోనే అంది పార్వతి.

భార్య నోటికి భయపడి, ఏ విషయంలోనూ అంతగా కలిగించు కోడు రాంబాబు. కాని యే తప్పూలేని కోడల్ని వాళ్ళింటికి పంపించేయ డాన్ని సహించలేకపోతున్నాడు. ఆ అసహనం ఎన్నో రోజుల్నించి అతని గుండెల్లో మంటల్ని రేపుతోంది. అందుకనే ఆ విషయాన్ని అప్పుడప్పుడూ లేవనెత్తుతూ ఉంటాడు రాంబాబు. ఎప్పటికయినా భార్యకి, కొడుక్కీ మనసు మారుతుందేమోనన్న ఆశ చిరుదీపంలా అతని అంతరంగంలో ఎక్కడో మిణుకుమిణుకుమంటోంది. "సువర్ణ వీడికి దీటైన భార్య కాక పోతే, మొదట్లోనే మనం వీళ్ళిద్దరికీ వివాహం చెయ్యకుండా ఉండాల్సింది పార్వతీ! ఇన్నాళ్ళు సంసారం చేసిన తర్వాత నువ్వూ వీడూ ఏకమై కోడల్ని నానా హింసలకూ గురిచేసి ఇంటినుంచి పంపించేశారు. ఆమె ఎంతగా ప్రాధేయపడినా రోదించినా శిలల్లాంటి మీ మనసులు కరగలేదు. కరిగిన నా హృదయం, పరిణామాల్ని దృష్టిలో పెట్టుకుని ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది. నాకు చేతగాక కాదు పార్వతీ, కాని, ఆమెని భార్యగా ఏలుకోవల్సిన వాడు ఈ వెధవ. వీడు చదువైతే చదువు కున్నాడు గాని, లోకజ్ఞానాన్ని సంపాదించలేకపోయాడు. వట్టి బడు ద్ధాయిలా సొంత ఆలోచనల్లేకుండా నీ చెప్పుచేతల్లో కీలుబొమ్మలా ప్రవర్తిస్తున్నాడు. అందుకే నేనూ ఏమీ చెయ్యలేకపోయాను. ఇప్పటికైనా మించిపోయింది లేదు. సువర్ణని సగౌరవంగా తీసుకొచ్చేద్దాం. నలుగురూ హర్షిస్తారు." అంటూ కొడుక్కేసి తిరిగాడు రాంబాబు. "ఒరేయ్ రామం, నువ్వు సొంతంగా ఆలోచించరా అగ్నిసాక్షిగా నువ్వు వివాహం చేసుకున్న నీ భార్య ఇన్నేళ్ళు కాపురం చేసిన తర్వాత నీకు దీటైన భార్య కాకపోయిందా? ఎంత అన్యాయంరా? ఎంత ఘోరంరా? ఆడదాని జీవితం అంత చులక నైపోయిందేట్రా?" అంటూ కొడుకుని నిలదీశాడు.

రామం ఏమీ చలించలేదు. అతను తల్లి అడుగుజాడల్లో నడవాల్సిన

వాడేగాని, తండ్రి ఆజ్ఞల్ని శిరసావహించాల్సిన అలనాటి రాముడుకాదు. తండ్రికేసి ధైర్యంగానే చూసి అదోలా నవ్వేడు. ఆ నవ్వులో నిర్లక్ష్యం తొంగిచూస్తోంది. తండ్రిపట్ల భయభక్తులు ఏకోశానా లేనట్టే తోస్తోంది.

"నాన్నా, మీ ఛాందసపు భావాలు ఈ రోజుల్లో పనికిరావు. అధునాతన భావాలు కావాలి. ఆలోచనల్లో ముందుచూపు ఉండాలి. అంచేత, ఈ విషయంలో మీరేం కలిగించుకోకండి. మీ మానాన మీరు గమ్మున పడుండండి. అమ్మా నేనూ చూసుకుంటాం" నిష్కర్షగా చెప్పాడు రామం.

కొడుకు సమాధానం రాంబాబుకి బాధ కలిగించినా అంతగా పట్టించుకోలేదు. ఎందుకూ అంటే కొడుకు ప్రవర్తన అతనికి కొత్త కాదు గనక!

అంతలోనే పార్వతి అందుకుంది. ఆమెలో ఎక్కడలేని ఆనందం తొణికిసలాడుతున్నట్టు ఆమె మునిముని నవ్వులే చెప్పక చెబుతున్నాయి. పిల్లలు తన చెప్పుచేతల్లో ఉంటేనే కొందరు తల్లులు సంబరపడిపోతూ ఉంటారు పాపం. ఆ కోవకి చెందినదే పార్వతి కూడాను. "అబ్బాయి చెప్పింది అక్షరాలా నిజమండీ మీరు ఈ విషయంలో కలిగించుకోకుండా ఉంటేనే మంచిది. వీడికి సలక్షణమైన మరో సంబంధం చూసి వైభవంగా పెళ్ళి చేస్తాను చూడండి" అంది సగర్వంగా.

రాంబాబుకి వొళ్ళు మండిపోయింది. అతని మొహం జేవురించింది.

"ఆ....ఆ... మరో పెళ్ళి చేద్దువుగాని! అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్య ఉండగా మరో పెళ్ళి చేస్తే చట్టం చూస్తూ వూరుకోదు. వీణ్ని నిన్ను, నన్ను కూడా కటకటాల వెనక్కి తోయిస్తుంది. అంతేనా! వీడి ఉద్యోగం కాస్తా వూడుతుంది" ఆవేశంగా అన్నాడు, రాంబాబు.

పార్వతికి ఇవన్నీ తెలీవుగా!" "ఎందుకూడుతుంది?" తేలిగ్గా నవ్వుతూ అంది.

"సువర్ణ విడాకులివ్వలేదు కదా ఇంకా?"

"ఓ! అదా! కొత్త వియ్యంకులిచ్చిన డబ్బు దాని మొహానకొట్టి విడాకులు సంపాదిస్తాను. ఈ పార్వతి అంటే ఏమనుకుంటున్నారో ఏమో! నేనేం అల్లాటప్పదాన్నికానని గుర్తుంచుకోండి." ధైర్యంగా గర్వంగా అంది పార్వతి.

ఇక్కడ డబ్బు ప్రధాన సమస్య కాదని పార్వతి తెలుసుకోనందుకు విచారించాడు రాంబాబు. ఈ విషయంలో పార్వతితో ఇంక వాదన అనవసరమనుకున్నాడు.

"ఛీ!ఛీ. నీతో వాదించడం నాదే తెలివితక్కువతనం. ఎలాగో ఏడవండి మీరిద్దరూ...." అంటూ విసురుగా బైటికి నిష్క్రమించాడు రాంబాబు.

పార్వతి, రామం నిండుగా నవ్వుకున్నారు.

"నువ్వేం కంగారుపడకురా అబ్బాయ్. లక్షణమైన సంబంధం, లక్షలొచ్చే సంబంధం నేను చూస్తానుగా" అంది పార్వతి.

"ఉద్యోగం చేస్తున్న అమ్మాయినే చూడమ్మా!" అన్నాడు ఉత్సాహంగానే రామం.

"కాకపోతే సువర్ణలాంటి చవటమ్మను చూస్తాననుకుంటున్నావా? దానికంటే అన్నివిధాలా మెరుగైన దాన్నే చూస్తాను....నువ్వలా చూస్తూ ఉండు. అప్పుడందరూ ముక్కుమీద వేలేసుకుంటారు" అంది నిబ్బరంగా.

"నీ తెలివితేటలమీద నాకు నమ్మకం ఉందమ్మా!" మందహాసంతో అన్నాడు రామం.

పార్వతి మరింత పొంగిపోయింది.

"కట్టుకున్న భర్తగా మీ నాన్న నా తెలివితేటల్ని గుర్తించకపోయినా కొడుకుగా నువ్వయినా గుర్తించావురా రామం. అది చాలురా" అంటూ ఆప్యాయంగా కొడుకు తల నిమిరింది పార్వతి.

ముసి ముసిగా నవ్వుకున్నాడు రామం. అమ్మ ఆప్యాయత నీడనే అతనికెప్పుడూ సంతృప్తి లభిస్తుంది. అతని మెదడు అంతమేరకే యెదిగిందేమో!

"అమ్మా...."

"ఏమిట్రా..."

"అలా మా స్నేహితుడింటికి వెళ్ళొస్తానే...."

"అలాగే వెళ్ళిరారా. అన్నట్టు ఈ మధ్య సువర్ణ యెక్కడైనా అగుపించిందట్రా?"

"అగుపించిందమ్మా! రెండు మూడు సార్లు అగుపించింది. కాని,

నేనే మొహం తిప్పేసుకున్నాను. ఇంక దాంతో నాకేం పని?" అన్నాడు నిర్లక్ష్య ధోరణిలో.

"మంచిపని చేశావురా.... అలాగే ఉండాలి సరే వెళ్ళిరా...."

రామం ఉత్సాహంగా నవ్వుకుంటూ నిష్క్రమించాడు బైటికి.

* * *

రామంకి సువర్ణతో వివాహమై నాలుగేళ్ళు గడిచాయి. ఈ నాలుగేళ్ళ సుదీర్ఘ కాలంలోనూ సువర్ణ అనుభవించిన ఆనందంగాని, సుఖశాంతులుగాని ఏమీ లేవనే చెప్పాలి. ఎందుకూ అంటే, రామం తల్లిచాటు కొడుకుకావడం! అతనికి సొంత ఆలోచనలు లేకపోవడం. ప్రతి చిన్న విషయానికీ తల్లి సలహా తీసుకోవడం అతని నిత్యకృత్యం! అందుకనే అతని తల్లి పార్వతి పరోక్షంగా కోడలిపై అధికారం చెలాయించి ఆనందం లేకుండా చేసింది. పార్వతి అత్తగారికి ప్రతీకగా ప్రాతినిధ్యం వహిస్తూ, అడుగడుగునా సువర్ణని సాధిస్తూ వుండేది. అకారణంగానే సువర్ణ చేసే ప్రతి పనినీ విమర్శిస్తూ వచ్చేది. తాళిగట్టిన భర్త సహకారం ఏమాత్రమూ లేకపోతే సువర్ణ మాత్రం యింకేం చెయ్యగలదు? మౌనంగా వుండిపోయేది,

సువర్ణ కామర్సు గ్రాడ్యుయేట్ అయినా, ఆధునిక భావాలు ఆమెలో చోటు చేసుకోలేదు. సంప్రదాయబద్ధంగా మసలుతూ వుండేది. అందుకే, అత్తగారు ఎన్నివిధాల విమర్శించినా మాటల తూటాలతో మనస్సుని తూట్లు పొడిచినా మనసులోనే బాధపడేదేగాని, ఒక్కనాడూ ఎదిరించిన పాపాన పోలేదు.

ఆమె బలహీనతని సక్రమంగా వినియోగించుకుంది పార్వతి. కాని, యిలా ఎన్నాళ్ళు? అని అప్పుడప్పుడు ప్రశ్నించుకున్నా ఎన్నాళ్ళయినా తాను సహించక తప్పదనుకుంది సువర్ణ.

దీనికితోడు అత్తతోపాటు, భర్త ఎత్తిపొడుపు మాటలు, చెయ్యి చేసుకోవడం క్రమంగా అధికమయ్యాయి. "నా జీవితానికో చీడపురుగులా దాపురించావే! చదివావు.... ఎందుకూ? ఒక వుద్యోగమా?.... సద్యోగమా? హాయిగా మూడుపూటలా మెక్కేసి కూచోవడమేగా? ఓ అందమా, చందమా? ఆ మొహం చూస్తేనే అసహ్యమేస్తుంది? నీకంటే పనిమనిషి నయం...." అంటూ యెద్దేవా చేశాడో రోజు.

సువర్ణ హృదయం చివుక్కుమంది. ఎప్పుడూ లేనంతగా గుండె గాయపడింది. తాళిగట్టిన భర్త ఎంత నీచంగా మాట్లాడుతున్నాడు? నేటి సమాజంలో పురుషాధిపత్యం ఎంతవున్నా మరీ యింత నీచంగా మాట్లాడుతున్న మొగుడుతో తనేం సుఖపడగలదు? 'ఛీ, పొమ్మని' ప్రతి క్షణం పరోక్షంగా అంటుంటే తనకు మాత్రం ఆత్మాభిమానం లేదూ? తనకీ ఆవేశం, ఆక్రోశం రాదూ? సహనానికయినా ఓ సరిహద్దుండాలికదా! జీవమున్న మనిషిలా కాకుండా కేవలం ఓ మట్టిబొమ్మలా వాళ్ళన్నవన్నీ సహించి పడుండాలా?.... ఆమెలో ఆలోచనలు స్వైరవిహారం చేశాయి.... ఆమెలోని సహనం చచ్చిపోయింది. చైతన్యం వొళ్ళువిరిచింది. మొహంలో రంగు మారింది. "ఎందుకలా నోరు పారేసుకుని మీ యిష్టం వచ్చినట్లు వాగుతారండీ? మీకు యిష్టం లేకపోతే నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు?" అంది విసురుగానే.

రామం నిర్ఘాంతపోయాడు. తమ పెళ్ళయిన తర్వాత భార్య ఎదిరించి జవాబు చెప్పడం అదే ప్రథమం! అందుకే అతని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

"అదే బుద్ధి తక్కువయ్యిందే! ఇప్పుడు విచారిస్తున్నాం...." అన్నాడు కోపంగానే.

"ఇప్పుడు విచారించి ఫలితమేముందండీ? అగ్నిసాక్షిగా పెనవేసుకున్న దాంపత్య బంధం మనది! అది ఎంతో పవిత్రమైనది. ఆ బంధాన్ని ఎవ్వరూ విడదీయలేరు!

రామం మొహం జేవురించింది. సువర్ణ యిన్ని మాటలన్నందుకే అతనికి వొళ్ళు కంపరమెత్తుతోంది.

"గాడిదగుడ్డు! అగ్నిసాక్షి కాదు.... ఆవకాయసాక్షీ కాదు. ఇప్పుడవన్నీ ఎవడిక్కావాలి? రోజులు మారుతున్నాయి. పద్ధతులూ మారుతున్నాయి. నువ్వు నాకు నచ్చలేదు. నీతో కాపురం చెయ్యడం నాకిష్టం లేదు. అందుకే నీకు నేను విడాకులిస్తాను...." అదేదో ఘనకార్యంలా గర్వంగా అన్నాడు రామం.

సువర్ణ బెదిరిపోలేదు. ఆమె గుండెను గుండ్రాయి చేసుకుంది.

సన్నగా నవ్వింది. "కాని, నేను కూడా విడాకులకి అంగీకరించాలి కదా?" అంది నిర్లక్ష్యంగానే,

భార్య నిర్లక్ష్య వైఖరిని భరించలేకపోయాడు రామం.

"నువ్వేమిటి, నీ బాబు అంగీకరిస్తాడే...." అంటూ విసురుగా వచ్చి ఆమె జెడ పట్టుకున్నాడు.

సువర్ణకి ఎప్పుడూ లేని ధైర్యం, ఆవేశం వచ్చాయి. ఉపేక్షించ లేదు. ఒక్కసారి అతని చేతిని విదిలించుకుంది. కొట్టడానికి చెయ్యెత్తాడు రామం.

"ఆగండి. ఇంక మీ ఆటలు సాగనివ్వను. నా వంటిమీద చెయ్యి పడితే సహించను...." అంది ఆవేశంగానే.

"ఏంజేస్తావే?"

"నేనూ చెయ్యి చేసుకోవల్సి వస్తుంది...." అంది దృఢంగా.

రామం వెనక్కి తగ్గాడు. చిత్తరచూపులతో. అప్పుడే అక్కడికి వచ్చిన పార్వతి, సువర్ణ మాటలు వింది. సువర్ణలో వచ్చిన పరిణామం ఆమెకి భయం కలిగించింది. ఇంత గయ్యాళి మనిషి నీరుగారిపోయింది. ఇక లాభం లేదనుకుంది. కళ్ళెర్రజేసింది.

"చెయ్యి చేసుకుంటావే... ఎందుకు చేసుకోవూ? మావాడిమీద చెయ్యి చేసుకోడానికేకదా, నిన్ను కోడలుగా చేసుకున్నాను? వాడికి భార్య వన్న యింగితమైనా లేకుండా వాడిమీదే చెయ్యి చేసుకుంటానంటావా? ఇంక ఉపేక్షించి లాభంలేదు. నీ పొగరు, ప్రారంభంలోనే తుంచేయాలి. తక్షణం మీ వాళ్ళింటికి బయల్దేరు. మళ్ళీ యీ యింటి గడప తొక్కకు ... వూ ... కదులు " అంది పార్వతి వుద్రేకంతో.

'పండూ పండింది.... కాకీ వాలింది' అన్నట్టుగా చిక్కిన యీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది పార్వతి.

సువర్ణ కాస్త తగ్గింది. "అత్తయ్యా.... అదికాదు ...." అని యేదో అనబోయింది.

రామం అందుకున్నాడు. "ఏమిటే యింక? ఒక్కమాటయినా అడ్డానికి వీల్లేదు. ఈ ఇంట్లో నీకిక స్థానంలేదు. పో! వెళ్ళిపో! విడాకుల

కోసం అర్జీ పెట్టుకుంటాను. అప్పుడు చూస్తాను నీ అహం యెంతో.... పూ కదులు ." అన్నాడు కటువుగానే.

సువర్ణ యింకేమీ ఆలోచించలేదు. ఆ యింట్లో నిత్యం నరకం అనుభవించడంకంటే యిక్కణ్ణించి బైటపడ్డమే శ్రేయస్కరమనుకుంది. చరచరా వెళ్ళి సూట్ కేసు సర్దుకుంది. కన్నవారు పెట్టిన నగలు మాత్రమే తీసుకుని బైటికొచ్చింది. ఖాళీ ఆటోని పిల్చి, వూళ్ళోనే వుంటోన్న కన్నవారింటిక వెళ్ళిపోయింది, సువర్ణ.

ఇన్నాళ్ళకి తమ పాచిక పారినందుకు పార్వతి. రామం మురిసి పోయారు.

సాయంత్రం ఇంటికొచ్చిన విషయం తెలుసుకున్న రాంబాబు భార్యని, కొడుకుని తెగ చీవాట్లు పెట్టాడు. ఏం లాభం? చెవిటివాళ్ళ ముందు శంఖం వూదినట్టే!

* * *

సువర్ణ కన్నవారింట్లోనే వుంది. ఆమెని తల్లిదండ్రులు మంచి మనసుతో అవగాహన చేసుకున్నారు.

సువర్ణలో ఇప్పుడు బాగా మార్పు వచ్చింది. పట్టుదల పెరిగింది. జీవితంలో ఏదో సాధించాలన్న కృతనిశ్చయం ఆమెని ప్రోత్సహించింది. బ్యాంకు పరీక్షలకు తయారవ్వాలన్న సంకల్పం ఆమె హృదయంలో నాటుకుపోయింది. ఉపేక్షించకుండా అవసరమైన పుస్తకాలు తెచ్చుకుని రాత్రింబవళ్ళూ కూడా చదివింది. బ్యాంకు పరీక్షలు రాసింది. ఆమె కృషి ఫలించింది. సెలక్టయ్యింది ఉన్న వూళ్ళోనే ఆమె పోస్టింగు ఏర్పాటు చేయించాడు. ఆమె తండ్రి.

సువర్ణ ఇప్పుడో బ్యాంకు ఉద్యోగిని. ఈ స్థాయికి తాను ఎదిగి నందుకు సువర్ణ ఉప్పొంగిపోయింది. ఆమె తల్లిదండ్రులూ ఆనందించారు.

* * *

ఓరోజు సువర్ణని బ్యాంకులో చూసి తన కళ్ళని తానే నమ్మలేక పోయాడు రామం. నాలుగో నెంబరు కౌంటరులో పనిచేస్తోందామె. సువర్ణ ఉద్యోగం చెయ్యడమా? ఆమె నిజంగా సువర్ణేనా? లేక సువర్ణను పోలిన

ఇంకో వ్యక్తా?.... అన్న సందేహం రామంలో చోటు చేసుకుందీ అంటే, సువర్ణ తెలివితేటలపట్ల అతనికి సదవగాహన లేకపోవడమే!

ఇంటికి వెళ్ళి విషయాన్ని తల్లితో చెప్పాడు రామం. పార్వతి కూడా విస్తుపోయింది "నువ్వు సరిగ్గా చూశావా్రా?" అంది సందేహంగానే.

"నాకూ అనుమానం వచ్చిందమ్మా! అందుకని, దూరంగా నిల్చుని రెండుమూడుసార్లు పరిశీలనగా చూశాను. అక్కడ పన్జేస్తున్న ఓ గుమాస్తాని అడిగాను కూడాను, ఆమె పేరేమిటని. సువర్ణనే చెప్పాడు. వారం రోజుల క్రితమే ఉద్యోగంలో చేరిందని చెప్పాడు. ఖచ్చితంగా సువర్ణే! అందులో సందేహం లేదమ్మా! పట్టుదలతో కష్టించి సాధించిందన్నమాట! మనిషి కూడా ఇప్పుడెంతో ఆకర్షణీయంగా ఉందమ్మా" చెప్పుకుపోయాడు రామం.

నిజానికి సువర్ణని చూసిన మరుక్షణం నుంచీ రామంకి ఎవరో కొత్త వ్యక్తిని చూసినట్టే అనిపించింది. అంతగా మారిపోయిందామె.

"మరీ మురిసిపోకురా రామం. కాస్తనీ మనసుకి కళ్లెం వెయ్యి. సువర్ణ ఇప్పుడు ఉద్యోగం చేస్తోందంటే ఆమె పట్ల మన ప్రవర్తనలో మార్పు రావాలి. ఇప్పుడు డబ్బే డబ్బు!" మెల్లగా నవ్వుతూ అంది పార్వతి తన పథకం మార్చేస్తూ.

"అయితే వెళ్ళి నా తొందరపాటుకి క్షమాపణ చెప్పుకోమంటావా అమ్మా?" ఆసక్తితో అన్నాడు రామం. తన ప్రతిపాదనని తల్లి తప్పకుండా అంగీకరిస్తుందన్న నమ్మకం అతనికుంది.

"ఇంకా నన్నడుగుతావేంటిరా? మనిషి కూడా ఇప్పుడు అందంగా అగుపిస్తుందంటున్నావు. ఉద్యోగంలో చేరింది. ఉభయతారకం కదూ? వెళ్ళి, దాన్ని ప్రసన్నురాలిని చేసుకో! బెట్టు వదిలేసి, క్షమించమని ఓ అస్త్రం విడిచిపెట్టు. తప్పకుండా అది కరిగిపోతుంది. నీకు మరో పెళ్ళి చేద్దామనుకున్నాను సలక్షణంగా. కాని, సువర్ణ విడాకులకోసం సుముఖంగా లేదే మరి? వెధవ చట్టాలూ....చట్టుబండలూను! మరో మార్గంలేదు" అంటూ కొడుక్కి సలహా ఇచ్చింది పార్వతి.

వరండాలో పేపరు చదువుకుంటున్న రాంబాబు అంతా విన్నాడు. అతనికి వొళ్ళు మండింది. విసురుగా లోపలికొచ్చాడు ఉండబట్టలేక.

"ఛీ! ఛీ! మీరు మనుషులేనా? మీలో ఏమాత్రమైనా ఆత్మాభిమానం, సిగ్గు, శరం ఉన్నాయా? 'నువ్వలాంటిదానివి... ఇల్లాంటి దానివి' అంటూ ఛీకొట్టి ఇంట్లోంచి పంపించేశారు సువర్ణని. పర్యవసానాలు ఎట్లా ఉంటా యని కూడా ఆలోచించలేదు. అవన్నీ మర్చిపోయి, మళ్ళీ ఏం మొహం పెట్టుకుని ఆమె దగ్గరికి వెళ్ళి క్షమాపణ చెప్పుకుని ఇంటికొచ్చేయమని ఆహ్వానిస్తావురా రామం? మీ అమ్మకి బుద్ధిలేకపోతే నీకైనా ఉండక్కర్లా? వెళ్ళు... వెళ్ళి అడిగితే చెప్పుచ్చుక్కొడుతుంది....వెళ్ళు..." ఉద్రేకంతో అనేసి, మళ్ళీ యథాస్థానానికి వెళ్ళి కూచుండిపోయాడు, రాంబాబు.

తల్లీ, కొడుకు తెల్లబోయి పరస్పరం మొహాలు చూసుకున్నారు తప్పించి, రాంబాబు మాటలకి అంతగా విలువివ్వలేదు. "మీ నాన్నగారి మాటలకేం లేరా! మనకవి మామూలే! నువ్వు రేపే వెళ్ళి సువర్ణని కలుసుకో. తర్వాత, నేను వాళ్ళింటికి వెళ్తాను. మనం రమ్మనడమే గొప్ప! సువర్ణ మారు మాటాడకుండా అంగీకరిస్తుంది చూడు...." అంది ఆశతో అహంతో.

రామం ఆనందాన్ని పట్టలేకపోతున్నాడు. "అలాగేనమ్మా! రేపు సెలవుపెట్టి సాయంత్రం వెళ్తాను" అంటూ అక్కణ్ణించి నిష్క్రమించాడు.

పార్వతి కోడలు తేబోయే నెలజీతం గురించి ఆలోచిస్తూ ముసి ముసిగా నవ్వుకుంది. ఆమె మనోనేత్రంలో అన్నీ నోట్లే అగుపిస్తున్నాయి.

* * *

స్వార్ధపరులూ, కేవలం డబ్బునే ప్రధానంగా కాంక్షించే డబ్బు మనుషులూ ఎంతటికయినా తెగిస్తారు. ఎంత నీచానికయినా దిగజారి పోతారు. వారికి ఆత్మాభిమానం పూజ్యం. సిగ్గు, బిడియం అసలే ఉండవు. వారు కాంక్షించేది తమ ప్రయోజనమే! అటువంటి కోవకే చెందుతారు పార్వతి, రామం కూడాను!

ఆరోజు సెలవు పెట్టేశాడు రామం. నీటుగా తయారై, సాయంత్రం నాలుగ్గంటల్నించీ సువర్ణ పనిచేస్తోన్న బ్యాంకు గేటుకి కాస్తంత దూరంలో

ఉన్న కిళ్ళీకొట్టు దగ్గర నిరీక్షించసాగాడు. ఎంతసేపు నిల్చున్నా అతనికి విసుగనిపించడం లేదు అవసరం అతనిది గనక.

సువర్ణ బ్యాంకు నుంచి బైటికొచ్చింది. ఖజాన బాగ్‌తో నడుచుకుంటూ బస్సు స్టాప్‌కేసి నడక సాగిస్తోంది.

"హలో, సువర్ణా .." కేకవేశాడు కాస్తంత దూరం నుంచి.

సువర్ణ వింధిగాని, వెనుదిరిగి చూళ్ళేదు. "నిన్నే సువర్ణా...." దగ్గరగా వెళ్ళి మళ్ళీ అన్నాడు.

సువర్ణ ఆగి వెనక్కి తిరిగింది. "నన్నేనా?" అంటూ ప్రశ్నించింది కొత్త వ్యక్తిని అడుగుతున్నట్టుగా. ఔను! నిన్నే ఇంకెవర్ని పిలుస్తాను ఇంత చనువుగా?" అన్నాడు రామం కాస్త తడబడుతూనే.

"ఏమో! అయినా, ఇప్పుడు గుర్తుకొచ్చానా ఇంతకాలానికి....?" నడుస్తూనే అంది సువర్ణ.

రామం ఆమె పక్కనే నడుస్తున్నాడు. ఆమె ప్రశ్న వాడిగానే తగిలిందతని గుండెల్లో. కాస్తంత తబ్బిబ్బయ్యాడు. "అబ్బే! గుర్తుకొస్తున్నావనుకో...." అని యేదో చెప్పబోతూ ఉంటే మధ్యలోనే అందుకుంది సువర్ణ.

"అటువంటి సమయాల్లోనే మీ అమ్మగారు మీ మనోనేత్రంలో మెదిలి, కళ్ళెర్రజేసి ఉంటారు. దాంతో కంగారుపడి, మర్చిపోయి ఉంటారు అంతేనా?" వెటకారంగా నవ్వుతూనే అంది సువర్ణ,

"అదేం కాదనుకో...." నసిగేశాడు రామం "ఎప్పటికప్పుడే నిన్ను కలుసుకుందామని ఉండేది. అయితే, మొహం చెల్లక, ఆ ఆలోచనని అమల్లో పెట్టలేకపోయేవాణ్ణి. ఈ రోజు ధైర్యంచేసి కలుసుకున్నాను. నేనూ అమ్మా అనాలోచితంగా ఆవేశంతో ఏవేవో అనేశాం వాటన్నింటినీ మనసులో పెట్టుకోకు. మా అమ్మ కూడా ఎంతగానో పశ్చాత్తాపపడుతోంది. మీ ఇంటికి వస్తానంది కూడాను. జరిగిందంతా మర్చిపోయి ఇంటికి వచ్చేసెయ్ సువర్ణా...." అన్నాడు అర్థింపు ధోరణిలో.

సువర్ణ పకపక నవ్వింది. అప్పుడే ఓ బస్సు వచ్చి వెళ్ళిపోయింది. అయినా బాధపళ్ళేదామె. "నన్ను మీ ఇంటికి రమ్మంటున్నారా?" అంది వెటకారంగా,

"మనింటికి రమ్మంటున్నాను..."

"మీరు రమ్మంటున్నారా?"

"ఔను సువర్ణా మా తప్పుల్ని మేం ఒప్పుకుంటున్నాం కదా! తప్పులు ఒప్పుకోవడమంటే పశ్చాత్తాపపడినట్టే కదా? అంచేత, వచ్చేసెయ్. అదంతా ఓ కలలా భావించి మర్చిపో. ఇకనుంచి సరికొత్త జీవితం, సుఖమయ జీవితం ప్రారంభిద్దాం" అన్నాడు రామం.

సువర్ణ రామం మొహంలోకి సూటిగా చూసింది. ఆమె అంతరంగంలో అగ్నిగుండం రాజుకుంటోంది. "మీ అమ్మగారి ఆజ్ఞ తీసుకున్నారా?" ఎగతాళిగా అంది.

"అమ్మకూడా నిన్ను తీసుకొచ్చేయమనే చెప్పింది సువర్ణా! నీ అభిప్రాయం తెలుసుకున్నాక, తనే స్వయంగా మీ ఇంటికి వస్తానంది"

"అదీ! అలా చెప్పండి. అమ్మగారి ఆజ్ఞమేరకే మీరొచ్చారన్న మాట!" నవ్వింది. "అమ్మ అనుమతి లేనిదే మీరొక్క అంగుళమైనా కదలరుకదా? అందుకే ఆశ్చర్యపోయాను...." అంది హేళనగానే. "ఇకమీదట నేను సర్వ స్వతంత్రుణ్ని సువర్ణా! సొంతంగా ఆలోచిస్తాను. ఇంటికొచ్చెసెయ్...."

ఇంక ముసుగులో గుద్దులాట అనవసరమనుకుంది సువర్ణ.

"ఇప్పుడు, మీకు నాపట్ల అభిమానానికి ఎలా అభినందనలు తెలియజెయ్యాలో అర్థం కావడంలేదండీ! అయితే, గతాన్ని మర్చిపోవడం సాధ్యపడ్డం లేదండీ! మీ మాటల్నే ఓసారి గుర్తుకు తెచ్చుకోండి. పని మనిషికంటే అధ్వాన్నంగా ఉంటాన్నేను. నాకు అందమా, చందమా? నాలాంటిదాన్ని మీకు భార్యగా తగనండీ! మీకు దీటైన భార్యను, మీ అమ్మగారు ఎలాగూ తీసుకొస్తారు కదా! నాకు విడాకులిచ్చేస్తానని ఎప్పట్నుంచో పాటుపడుతున్నారు. నేనే తాత్సారం చేస్తూ వచ్చాను. అయితే, ఇపుడో నిర్ణయానికొచ్చేశాను. విడాకులకి నేనూ అంగీకరిస్తున్నాను" అంది దృఢంగా.

రామం షాక్ తిన్నట్టయ్యాడు. తన ప్రతిపాదన్ని ఆమె ఆనందంగా స్వీకరిస్తుందని భావించాడు. కాని, అతని ఆలోచనలకి భిన్నంగా సువర్ణ ప్రవర్తిస్తుంటే ఆశ్చర్యపోయాడు. "తొందరపడకు సువర్ణా! జరిగిందేదో

జరిగింది. చెప్పానుగా అదంతా ఓ కలలా భావించి మర్చిపోమని! ఇప్పుడు, నువ్వెంతో అందంగా ఆకర్షణీయంగా అగుపిస్తున్నావు, తెలుసా?"

సువర్ణ మళ్ళీ నవ్వింది. "ఓ! అలాగా? తపస్సుచేసి అందాన్ని సంపాదించానంటారా యేమిటి? అటువంటిదేమీ లేదే! ఎప్పటి సువర్ణనే నేను. మీ అంతరంగం ఏమిటో, నేను తెలుసుకోలేదనుకోండి రామం గారూ! అంత తెలివితక్కువదాన్నేం కాదు నేను. మీకు కావల్సింది నిజానికి అందం కాదండీ! డబ్బు! అప్పట్లో నాకు ఉద్యోగంలేదు. మీ చేతుల్లో పుష్కలంగా డబ్బుపోసి, మిమ్మల్ని బతిమాలి, నాకు నచ్చజెప్పి, మా నాన్న నన్ను మీ ఇంటికి పంపుతారనుకున్నారు కాని, అదీ జరగ లేదు. ఇప్పుడు నాకు ఉద్యోగం రావడం, మీలోనూ మీ అమ్మలోనూ కొత్త ఆశల్ని రేకెత్తించింది. నెలనెలా నేను తెచ్చే జీతం మీలోని మార్పుకి కారణమయ్యింది. అంతేగాని నామీద అభిమానముకాదు.... భార్యగా, మీరు నాకిస్తున్న విలువా కాదు...." నిష్కర్షగా చెప్పుకుపోయింది సువర్ణ.

రామం కాస్తంత తికమకపడ్డాడు. అతని మొహం వెలవెల బోయింది.

"నన్ను తప్పుగా అర్థం చేసుకుంటున్నావు సువర్ణా! నాలో ఎటు వంటి స్వార్థమూ లేదు. మనస్ఫూర్తిగానే నిన్ను ఆహ్వానిస్తున్నాను" అన్నాడు.

సువర్ణకి చప్పున ఓ ఆలోచన తట్టింది. "మీరంత ఆప్యాయతతో మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తూ ఉంటే నేను మాత్రం కాదంటానటండీ? మీ అర్థాంగిగా, మీ నీడలోనే సుఖశాంతులతో జీవించాలన్నదే నా అభిమతం కూడాను. అయితే, ఒక్క షరతుమీద వచ్చేస్తాను...." నవ్వుతూ అంది సువర్ణ.

"ఏమిటో?" ఆసక్తిగా అన్నాడు.

"ఉద్యోగం మానేసి వస్తాను....అంగీకారమైతే చెప్పండి...."

రామం పక్కనే పిడుగు పడినట్లయింది. అతనికి తల తిరిగి నట్టయ్యింది. ఏమిటీ మనిషి మొండి వైఖరి?....అనుకున్నాడు.

"ఉద్యోగం మానేస్తావా?" విస్తుపోతూ అన్నాడు.

"ఏనండీ? మీరు సంపాదిస్తున్నారు చాలదూ ? నేనేమో గృహిణిగా ఇల్లు చక్కబెట్టుకుంటాను ..."

"వద్దు సువర్ణా! ఉద్యోగం వదిలేయొద్దు! ఈ రోజుల్లో ఉద్యోగాలు దొరక్క యెంతోమంది తిరుగుతున్నారు. నువ్వు ఉన్న ఉద్యోగం వదిలేస్తా నంటావేంటి?" అన్నాడు, కంగారుగా.

సువర్ణ ఫకాల్న నవ్వింది, "చూశారా, మీ అంతర్యం ఎలా బైట పడిందో! నాకు తెలుసునండీ-మీకు కావల్సింది, నేను నెలానెలా తెచ్చే జీతమేగాని నేనుకాదు. మీ ఇంట్లో నా అడుగు మళ్ళీ పెట్టొద్దనీ ఏనాడో ఆదేశించారు. నాకూ స్వాభిమానం ఉందికాబట్టి, మీ ఇంట్లో అడుగు పెడతా ననుకోవడం మీ తెలివితక్కువతనం. మీరు కోరే విడాకులకు లిఖిత పూర్వకమైన నా అంగీకారం త్వరలో మీకు అందుతుంది. మీ అమ్మ మీకు చేయబోయే సలక్షణమైన మరో పెళ్ళికి సిద్ధంగా ఉండండి. మళ్ళీ ఎప్పుడూ నాతో మాట్లాడ్డానికి ప్రయత్నించకండి. మీకూ నాకూ ఇంకే సంబంధంలేదు. ఉండదు. గుడ్‌బై...." అంటూ చరచరా బస్సు స్టాప్‌కేసి నడక సాగించింది సువర్ణ.

రామం తెల్లమొహం వేసి, వెళ్ళిపోతున్న సువర్ణకేసి చూస్తూ క్షణం చలనరహితుడై ఉండిపోయాడు.

* * *

ఇంటికి వెళ్ళిన రామం తల్లితో, సువర్ణతో జరిగిన సంభాషణని వివరంగా చెప్పాడు.

అదంతా విన్న రాంబాబు విరగబడి నవ్వేడు. అతనికి ఎంతో ఆనందమన్పించింది. అతనికి ఇలా జరుగుతుందని ముందుగానే తెలిసినట్టు పడీ-పడీ నవ్వాడు. నవ్వుతూనే ఉన్నాడు. పార్వతిగాని, రామంగాని మరేం మాట్లాడలేకపోయారు. మౌనంగా మొహాలు దించేసుకున్నారు.

* ఈనాడు, 14-8-1994 *